# అనంత రాగం

ఎం. ఉమామహేశ్వరరావు

హాలులో కూర్చుని ఎదురుగా ఉన్న శుభలేఖ లన్నింటినీ మళ్ళీ లెక్క పెట్టేడు అనంతం.

వరుసగా అన్నింటిమీదా అవి చేరవలసిన వాళ్ళపేర్లు వ్రాసి ఉన్నాయి. ముందుగా వ్రాసుకున్న జాబితా ప్రకారంగా బంధువుల పేర్లు, ఆ తరువాత వరసగా తెలిసినవాళ్ళ పేర్లు, స్నేహితుల పేర్లూ, ఇరుగూ – పొరుగూవాళ్ళ పేర్లూ అన్నీ కవర్లపై సక్రమంగానే వ్రాసి ఉన్నాయి.

అనంతం వయస్సు అరవై దాటి అరవై ఒకటిలో పడిందప్పటికి. అప్పటివరకూ చేస్తున్న ఉద్యోగం మంచి రిటైరై ఎంతోకాలం కాలేదు. జీవితం అనే గ్రంథంలోని పేజీలు అన్నీ చదవడం పూర్తయ్యాయనుకునేలోగానే అరవైసంవత్సరాలు పూర్తయిపోతాయి మనిషికి. ఈలోపునే చేస్తున్న ఉద్యోగం మంచి రిటైరైపోవడం తెలిసీ ఎదురు చూసే సంఘటన అది. శారీరకంగా విశ్రాంతైనా, మానసికంగ దుర్భర పరిస్థితి అప్పట్నించీ.

అనంతం యిద్దరు కొడుకులూ మంచి ఉద్యోగాలనే బంగారు రెక్కలొచ్చి సుదూర తీరాలకు వెళ్ళిపోయారు.

వాళ్ళక్కడ – తనిక్కడ ... బారమైన మనసుతో ...

ముప్ఫై సంవత్సరాలు కాపురం చేసి కష్టాల్లోనూ, సుఖాల్లోనూ భాగస్వామి అయిన యిల్లాలు జబ్బుపడి పైలోకాలకు వెళ్ళిపోయిన్నాడు మాత్రమే గుండెలు పగిలేలా రోదించాడు.

తల్లికి తలకొరివి పెట్టడానికైనా అందుబాటులో లేక ఎక్కడో దూరంగావున్న కొడుకుల కోసం గుండెలవిసేలా ఏడ్చాడు ... బాధపడ్డాడు.

ఎన్నోసార్లు జీవితంమీద విరక్తిపుట్టి చచ్చిపోవాలనిపించింది. కాని మిగిలిన ఆఖరి కన్నప్రేగు మమతానుబంధంతో ఆ ప్రయత్నం నుంచి లాగి యివతల పడవేసింది.

తను బ్రతికి తీరాలి ...

బ్రతికి ఏనాటికైనా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి ...

తనింటి వాకిట్లో పెళ్లిపందిరి కలకల్లాడుతూ కనిపించాలి ... తన చేత్తో మంగళాక్షితలు తన కూతురి శిరస్సుపై ప్రోక్షించాలి ...

... కన్నకొడుకుల విషయంలోనూ యిదే కోరేడు తను. అయితే ... ఏమయింది ?? ... ఏంచేసేరు వాళ్ళు ?? ...

తన ఆశల్ని నిలువునా కూల్చేసేరు.

ఎవరికివాళ్ళు తమకు నచ్చిన వాళ్ళను ఎంచుకున్నారు. ఆదర్శాలంటూ ఎక్కడెక్కడో పెళ్ళిళ్ళు చేసుకుని ఇంటికి చక్కా వచ్చారు.

తన ఆశలన్నీ నీటిమీద మూటలైనాయి.

కాలం మారింది...

ఈ కాలం పిల్లల అభిరుచి వందేళ్ళు ముందుంది.

ఇది పురోగమనమో, తిరోగమనమో అర్థం కాని ఏదో గమనంలో వుంది. అందుకే బావిలో గిలకలా కొట్టుమిట్టాడరాదన్న సత్యాన్ని గ్రహించి వూరుకున్నాడు.

ఉద్యోగం నుంచి రిటైరైనాక వచ్చిన యాభైవేల రూపాయలూ తన పేర్న 'బేంక్'లో వేసుకున్నాడు.

"ఒరే పిల్లలూ !... నేను రిటైరై పోయ్యాన్రా !!" అంటూ ఉత్తరం వ్రాస్తే... అలాగా అని, రావడానికి తీరికలు లేవంటూ వ్రాసేరు వాళ్ళు. అంతటితో తీరిపోయిందనుకున్నారు వాళ్ళ బాధ్యత.

వాళ్ళకు నిజంగా తీరుబడి లేకగాదు. తనమీద కోపం... తనకు వచ్చిన డబ్బుమీద వ్యామోహం... ఆ డబ్బు పంచి వెంటనే వాళ్ళకు యివ్వలేదు... అందువల్ల వాళ్ళకు అది అపకారం చేసినట్లా ?...

ఎలా అవుతుంది ?... కాదే ? !...

కారణం ! భారతి.

ఆ ఇద్దరి తరువాత పుట్టిన ఏకైక కూతురు. తల్లిలేని పిల్ల... ఆమెను కూడా ఓ అయ్య చేతిలో పెట్టాలని, ఓ యింటిదాన్ని చెయ్యాలని తండ్రిగా ఆశించడం తప్పా ?!...

ఎంతో ప్రయాసపడి కొడుకులున్న చోటుకెళ్ళేడోసారి.

"మీరు, మీ జీతాలతో హాయిగా బ్రతకండిరా ! మిమ్మల్ని నాకోసం నయాపైసా అడగను. నన్ను పెంచమనికూడ అడగను. కాని చెల్లి పెళ్ళి చేయాలి. మీలాగే అదీ పుట్టింది. మీలాగే అదీ ఓ యింటిదైతే కన్నతండ్రిగా నా బాధ్యత తీరుతుంది." అన్నాడు.

"అమాత్రం మేమూ చెయ్యగలం అవిడ పెళ్ళి !... ఆ డబ్బు మా కివ్వడాని కిష్టంలేదని చెప్తే సరిపోతుందిగా !!" విష్ఫూరంగా పలికేరు కోడళ్ళు.

"అవును. నిజంగానే ఇష్టంలేదు. భారతి పెళ్ళి జరిగేక ఏం చేసినా... ఏం పంచినా..." నిర్మొహమాటంగా ఆ మాటలు అని, అక్కడొక్క నిముషంకూడా వుండకుండ బయల్దేరి వచ్చేసేడు...

* * *

అనంతం ఆలోచనలకు అంతరాయం కలిగిందొక్కమారుగా. తేరుకుని శుభలేఖ లన్నింటినీ దొంతిచేసి కట్టగట్టేడు.

తెల్లారి లేచి దూరప్రాంతాల వాళ్ళకు ముందుగా పోస్టు చేసెయ్యాలి. ఇరుగూ, పొరుగుకు స్వయంగా యిచ్చి రావాలి ...

దీర్ఘంగా నిట్టూరుస్తూ లేచేడు అనంతం.

ఎలాగైతేనేం పెళ్ళింకా రెండ్రోజులుందనగా వచ్చేసేరు కొడుకులూ– కోడళ్ళూ.

వాళ్ళను చూసి అనంతం పెద్దగా సంబరపడిపోలేదు. వాళ్ళు రాకున్నా, ఒంటరిగానే, ధైర్యంగానే ఈ పెళ్ళి జరిపించదలుచుకున్నాడు. అయితే శుభలేఖలు అందీ అందడంతోటే ఏమనుకున్నారో, పరిగెత్తుకువచ్చేరు భార్యాపిల్లల్తో–

"మామయ్యగారు, మనమెవళ్ళం లేవనుకునే ఈ పెళ్ళి నిశ్చయించారు." పెద్దకోడలు శాంతి అశాంతిగా అంది.

"పోనీలే, అక్కా !! యిప్పటికైనా కబురంపేరు. సంతోషిద్దాం..." చిన్నకోడలు లలిత మరీ లాలిత్యంగా సాగదీసింది మాటల్ని. చివుక్కుమంది అనంతం మనస్సు. కొడుకుల వంక చూసేడు. మౌనంగా చూస్తూ కూర్చున్నారు వాళ్ళు. ముందుగా తనే నోరు విప్పేడు

"ఈ శుభకార్యం అయినాక మరింక నాకేం బాధ్యతలున్నాయి గనుక !?... వచ్చిన ఆ యాభైవేల రూపాయల్లోనూ పాతికవేలు కట్నం

పోగా, ఖర్చులన్నీ కలిపి మరో పదివేల వరకూ జరుగుతాయి. మిగతా డబ్బును బాంక్‌లోనే ఉంచేస్తే బావుంటుందని ఆలోచిస్తున్నాను."

ఆగి వాళ్ళవంక చూసేడు.

"ఆ మిగతా డబ్బు బాంక్‌లో ఎందుకు ? మా కిచ్చేసేయండి ! మా దగ్గర మీరు ఉందురు గాని. మేమేం పరాయివాళ్ళం గాదుగా ?!!"

కోరస్‌గా పలికారు కొడుకులు.

"మీరామాట అనలేదేమోని అనుకుంటున్నా !! మీరు పరాయివాళ్ళని ఎవరన్నారు ? నావాళ్ళు... నా పిల్లలు. నా మంచీ- చెడులు యిక ముందునుంచీ మీరుగాక యింకెవరు చూస్తారు ?! అయితే మీరిప్పుడు చాల దూరంలో వున్నారు. మీకు సంసారాలున్నాయి. ఇక్కడ వున్న మన ఆస్తి, ఈ ఇల్లూ- రెండెకరాల పొలమేగా!! ఈ రెండూ మీ యిద్దరికీ చెందుతాయి. నా తదనంతరం వాటిని మీ ఇష్టం వచ్చినట్లుగా చేసుకుందురుగాని... ఏమంటారు ?"

ఆగి కొడుకులవంక చూసేడు అనంతం.

"మీ ఇష్టం వచ్చినట్లు చేయండి ! ఏం చేసేదీ ? ఎప్పుడు చేసేదీ వ్రాస్తే వస్తాం..."

అంతే అన్నారా కొడుకులు.

బాధగా తల పంకించాడు అనంతం.

అనంతం ఎంతోకాలంగా కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న రోజు. అతని ఆశయం తీరే సమయం.

ఆ ఇంటి వాకిలి పెళ్ళిపందిరితో కలకల్లాడింది. పంపించిన శుభలేఖలు అందుకున్న మిత్రులూ, బంధువులూ, ఇరుగూ, పొరుగూ అందరూ వచ్చేరు. పెళ్ళిపందిరి కిటకిటలాడింది.

భారతిని ముస్తాబుచేసి కూర్చోపెట్టేరు వదినలు యిద్దరూ. వరుడు ఇంజనీరు సుధాకరం ప్రక్కన పెళ్ళిపీటలమీద తనకూతుర్ని చూసుకుని ఎంతో తృప్తిగా నిట్టూర్చాడు అనంతం.

"మాంగల్యంతంతు నానేన, మమజీవన హేతునా..." పురోహితుల మంత్రాల శబ్దంతో, భారతి మెడలో మూడుముళ్ళు వేసేడు పెళ్ళికొడుకు సుధాకరం.

గుప్పెటనిండా పట్టుకున్న అక్షింతలు కూతురి శిరస్సుపైనా, అల్లుడి శిరస్సుపైనా జల్లేడు కళ్ళవెంట ఆనంద భాష్పాలు రాలుతుండగా... కాళ్ళు కడిగి అల్లుడికి కన్యాదానం చేసేడు,

మనిషి జీవితంతో పెనవేసుకునేవి రక్తసంబంధం, ఆత్మీయతాను బంధాలున్నా...

ఆత్మీయులు లెక్కకుమించి వున్నారు. అందరి ఆశీర్వాదాలు తన బిడ్డ భారతికి అందేయి.

ఇక రక్తసంబంధాలుగా మిగిలిన ఇద్దరు కొడుకులూ మాకు శలవుల్లేవంటూ భార్యల్నీ, పిల్లల్నీ తీసుకుని ప్రయాణం కట్టేరు.





"ఓ, నాలుగు రోజులుండి వెళ్ళండిరా ! మళ్ళీ ఎప్పుడొస్తారో ఏవిటో !!!..." గుండెల నిండా నిండిన అనురాగంతో అర్ధించాడు వాళ్ళను. ఆ అర్ధించడంలో ఏం లోటుందని ?... కన్న తండ్రిగా కోరుతున్న కోరిక అది.

అనురాగం అందించే ఆ కన్న ప్రేగులోని మమతకు ఆ కొడుకులు చాల దూరంగా, భావాల కందనంత దూరంగా తిష్ఠ వేసుక్కూర్చున్నారు.

తండ్రి ప్రార్థనకు కరగలేదు వాళ్ళు. ముందుకే సాగేరు భార్యల్నీ, పిల్లల్నీ తీసుకుని.

* * *

భారతి అత్తగారింటికి ప్రయాణం అవుతొందా రోజు. కాలుగాలిన పిల్లిలా అశాంతిగా అటూ, ఇటూ తిరుగుతున్నాడు అనంతం.

ఏదో బెంగ, దిగులు మనసులో ముసురుకున్నాయి.

గాఢాంధకారంలో దిక్కులు తోచక వెదుకులాడుతున్న వాడిలా, కలత చెందిన గుండె చెఱువై, కన్నీరు కడవై పొంగి పోతోందా సమయంలో ...

ఎవరు ఆనకట్ట వెయ్యగలరా కన్నీటి వరదకు ?!... ఓదార్చి, సేదదీర్చే వాళ్ళింకెవరున్నారు గనక ?...

పరాకుగా ఉన్న అనంతం రెండు పాదాల మీద చటాల్న వాలిపోయింది భారతి.

ఉలిక్కి పడ్డాడు ...

కనురెప్పల శబ్దం కూడా వినిపించేంత నిశ్శబ్దం ఆ సమయంలో ...

అరవై ఏళ్ళు పైబడిన అనంతం ఒక్కమారుగా నూరు సంవత్సరాల వృద్ధుడై పోయాడు.

శరీరంలోని నవనాడులూ కృంగిపోతున్నాయన్నట్లనిపించింది. వంగి, కూతుర్ని లేవ

దీశేందుకు కూడా శక్తి చాలని విశ్వహాయతతో వణికిపోతూ జాలిగా, బాధగా, ఆమె వేపు చూసేదు.

భారతి వెక్కి, వెక్కి ఏడుస్తోంది.

కన్నీటితో తడిచిపోయిందప్పటికే ... ... ఆ చిన్నారి కూతురు మనస్సులో రగిలే ఆవేదనను తండ్రిగా గ్రహించి కూడా ఏమీ చేయలేక పోయాడు.

గుండె దిటవు చేసుకుందుకు ప్రయత్నించాడు.

''నాకేం ఫరవాలేదమ్మా !!... ఇంత కాలం బ్రతకలేదూ ధైర్యంగా !! అలాగే బ్రతుకుతాను తల్లీ... నా గురించి ఏమీ బెంగ పెట్టుకోవద్దు. చూడమ్మా ! ఈ పండుటాకు ఎప్పటికైనా రాలిపోయేదేగా ... ఒంటరైనా, పది మందితో వున్న సమయంలోనైనా,... సమయం ఆసన్న మైతే రాలిపోక వుంటుందా తల్లీ !? ... వెళ్ళిరా అమ్మా !...''

# అనంతరాగం

**అవును మరి ! అంతకంటే యింకేమవ** గలడు ఏ తండ్రయినా ? కన్నకొడుకులు ఉండ మన్నా ఉండలేదు. రెక్కలు వచ్చిన పక్షులు వాళ్ళు. ఆడపిల్లకు రెక్కలు రాకపోయినా, అండగా తామున్నామనే ధైర్యం చెప్పి, 'భరోసా' అనే రెక్కలిచ్చి అత్తవారింటికి పంపించాలి. కూతుర్ని తమ తమ వద్దే ఉండిపొమ్మని అడిగే నైతిక అధికారంగాని, అలా వుంచుకునే శక్తిగాని లేని అశక్తత కన్నవాళ్ళది.

''వారానికి ఒక్కటైనా నీ బాగోగులతో ఈ ముసలి తండ్రికి ఉత్తరం వ్రాసి పడేస్తుం డమ్మా ! !'' ఓదార్చబోయాడు.

అల్లుడు సుధాకరంకు కూడ చెప్పాకో వలసినవి చెప్పి, ఆ సాయంత్రమే 'గోదావరి' ఎక్స్‌ప్రెస్ ట్రయినులో వాళ్ళను ఎక్కించి,


1984
అడ్మిషన్లు


మధు
ఫిల్మ్ & టి.వి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్టింగ్
8-3-224/8/A/16, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్ 500045

సినిమా, టి.వి. నటీనటులకు
ఆధునిక పద్ధతులలో శిక్షణ యిస్తున్న మా సంస్థ
ప్రథమ సంవత్సరం పూర్తి కాబోతున్న
శుభ సమయంలో_
**1984** జనవరి నుండి ప్రారంభం కానున్న క్లాసులలో
చేరదలచిన విద్యార్థులకు ఈ నెల **10**వ తేదీ నుండి
అప్లికేషన్లు పంపబడును!
పూర్తి చేయబడిన అప్లికేషన్లు మాకు చేరవలసిన
ఆఖరు తేదీ: **15-11-1983**

విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక హాస్టలు వసతి కలదు.

అప్లికేషన్లు: "మధు ఫిల్మ్ & టి.వి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్టింగ్" పేర హైదరాబాదులోని ఏ బ్యాంకు ద్వారానైనా 30 రూ. (డిమాండ్ డ్రాఫ్ట్) పంపినచో రిజిస్టర్డు పోస్టులో అప్లికేషను పంపబడును!

LAA


సర్వం కోల్పోయినవాడిలా యింటికి చేరేడు అనంతం.

* * *

కాలం ఎవరితోనూ సంబంధం లేకుండా తన పని తాను చేసుకుంటూ పోతోంది.

ఒంటరితనంతో జట్టుకట్టుకుని ఉందా మన్నా ఉండలేకపోతున్నాడు అనంతం. నాలు గైదు పార్లు కొడుకులకు ఉత్తరాలు వ్రాసేదు పిచ్చిగా తనకే అర్థం కాని ఏదో ఆవేశంతో...

ఎప్పటికైనా తనను వాళ్ళు అర్థంచేసు కుంటారన్న ఆశ. తన రక్తంతో పుట్టిన వాళ్ళలో తన పట్ల ఆ విముఖత తాత్కాలికమే నని భావించాడు...కాని,

వాళ్ళ నుంచి ఏ జవాబూలేదు. కనీసం వాళ్ళెలా వున్నారో తెలీదు.

ఆ రోజు............

పోస్టుమన్ అనంతం పేర్న ఓ ఉత్తరం యిచ్చి వెళ్ళేడు.

తడబడే అడుగులతో వచ్చి అందుకున్నాడది. శరీరం చిన్నగా కంపించసాగింది. మనస్సంతా గజిబిజిగా అల్లుకున్న పరిస్థితి.

కవరు చించి చూసేడు.

హైదరాబాదు నుంచి కూతురు భారతి వ్రాసింది.

......నాలుగు నిమిషాలు పాటు ఉత్తరం లోని అక్షరాల గుండా అనంతం మనస్సు పరిగెట్టింది.

అక్షరక్షరానికీ ఎగిసిపడే తరంగాల్లా సంతోషం. ప్రతీ వాక్యంలోనూ కూతురి ప్రేమ, ఆప్యాయతా, జాలి, తపన,కనిపించాయా వృద్ధ మనస్సుకు.

ఉత్తరాన్ని ఆశాంతం చదివేసేదు అనంతం.

అతని మనస్సు గాలిలో స్వేచ్ఛగా ఎగురు తున్న పక్షిలా వుంది. అప్రయత్నంగా అతని పెదాలు గొణుకున్నాయి.

''అమ్మా! భారతీ !...నువ్వు నా కూతురివే గాదమ్మా ! ... నా పాలిటి దేవతవి. నన్ను కన్న తల్లివి...నీ మనస్సు నాకు తెలుసునమ్మా !! నీ భర్త సుధాకరానికి యిక్కడ 'బదిలీ' అయిందని, ఇక నిన్ను కనిపెట్టుకుని దగ్గరే ఉంటామనీ, కంటికి రెప్పలా చూసుకుంటామనీ, నువ్వు వ్రాసేవు... ఈ వార్తను చదివి తట్టుకో లేకపోతున్నాడీ తండ్రి... ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోతున్నాడీ ముసలిపీనుగ...

కన్న కొడుకులుండీ, వెలివేసినా, పరా యింటిదానివైగూడ ఈ దిక్కుమాలిన తండ్రి మీద నీకున్న జాలీ, ప్రేమా నాకు తెలుసు తల్లీ !! ... ... ... ... ... అవునమ్మా !...అవును... నాకీ ఒంటరితనం ఖైదు నుంచి విముక్తి కలిగిం చేందుకే నువ్వు వస్తున్నావు గదూ !!''

అస్పష్టంగా గొణక్కుంటున్న అనంతం అలా ఎంతోసేపు ఆ ఉత్తరం పట్టుకుని కన్నీరు కారుస్తూ ఉండిపోయాడు. ★